ప్రజాశక్తి

బుధవారం 4 సెప్టెంబరు 2024 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

హృదయ విదారకం

- గుర్తు తెలియన శవాలు
- అంత్యక్రియలు కూడా నిర్వహించలేని దుస్థితి
- తోపుడు బండ్లు, రిక్షాల్లో మృతదేహాల తరలింపు
- పొలాలు, నివాస ప్రాంతాలకు కొట్టుకువస్తున్న వైనం



ముంపులో సింగ్‌నగర్ ప్రాంతం

ప్రజాశక్తి - డెస్క్

ప్రకృతి ప్రకోపంలో ఎన్నో హృదయ విదారక దృశ్యాలు కనిపిస్తున్నాయి. గుర్తు తెలియని శవాలు, అయిన వారు దూరమై సరిగా అంత్యక్రియలు కూడా నిర్వహించలేని దుస్థితి, గల్లంతైన వారు ఏ చెట్టున, ఏ పుట్టన ఉన్నారో తెలియక కుటుంబ సభ్యుల రోదనలు వంటి దృశ్యాలు అందరినీ కలిచివేస్తున్నాయి. పదుల సంఖ్యలో మృతదేహాలు వెలుగుచూడడం వరద బాధితులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. కనీసం చనిపోయిన వారి వివరాలు కూడా తెలియని దీన స్థితి నెలకొంది. తోపుడు బండపైన, రిక్షాలపైన మృతదేహాలను తరలించడం కనిపిస్తోంది. కొన్ని మృతదేహాలు కొట్టుకు వచ్చి జనావాసంలోకి తేలుతున్నాయి. మృతుల సంఖ్య ఎంతో కూడా చెప్పలేని స్థితిలో అధికార యంత్రాంగం ఉంది. మూడు రోజుల క్రితం ప్రారంభమైన వర్షాలు, వరదలతో ప్రజాజీవనం అస్తవ్యస్తంగా కాగా, మరోవైపు మృతులు రోజురోజుకూ పెరిగిపోతున్నారు. మొదటి రోజున మొగల్రాజపురంలో కొండచరియలు విరిగిన ఘటనలో ఆరుగురు మరణించగా, ఆ తర్వాత వరదలు మృత్యువులా వచ్చిపడ్డాయి. విజయవాడ పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఆరుగురిని గుర్తించారు. ఇంట్లోకి వరద నీరు రావడంతో పద్మావతి (48) అనే మహిళ గుండె ఆగి మరణించింది. సోమవారం ఈ ఘటన జరిగింది. అప్పటి నుండి ఇంట్లోనే మృతదేహంతో ఉన్న కుటుంబ సభ్యులు చివరికి తోపుడు బండిపై ఐదు కిలో మీటర్లు



ముంపులో సింగ్‌నగర్ బాధితులు

మతదేహాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించాల్సి వచ్చింది. అలాగే అజిత్‌సింగ్ నగర్ పైపుల్ రోడ్డు సమీపంలోని ఏ వన్ టీ స్టాల్ వద్ద 50 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. గత మూడు రోజులుగా మతదేహం నుండి దుర్వాసన రావడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం మండలం జూపూడిలో కృష్ణా వరదలో గల్లంతైన కీలేశపురంనకు చెందిన లైన్‌మెన్ కోటేశ్ మృతదేహం మంగళవారం లభ్యమైంది. గల్లంతైన ప్రదేశానికి కొద్దిదూరంలోనే ఆయన మృతదేహాన్ని గుర్తించారు. ఇంకా విజయవాడ న్యూ రాజరాజేశ్వరిపేటలో కొడాలి యశ్వంత్ (20) మరణించాడు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు మతదేహాన్ని పూర్ణానందంపేటలోని బంధువుల ఇంటికి తరలించారు. అలాగే అజిత్‌సింగ్‌నగర్‌లో రెండు మృతదేహాలను కుటుంబ సభ్యులు తీసుకెళుతున్న దృశ్యాలు కనిపించాయి. అయితే వారి వివరాలు తెలియరాలేదు. అలాగే కండ్రికలో ఓ గుర్తు తెలియని మృతదేహం బయటపడింది. గుణదలకు చెందిన తండ్రీ కొడుకులు ఆదివారం గల్లంతవగా, తండ్రి కొల్లిపర వెంకటేశ్వరరావు మృతదేహం సోమవారం లభ్యమైంది. కుమారుడు సాయి సందీప్ మృతదేహం ఆచూకీ ఇంకా తెలియలేదు. బుడమేరు వరద నుండి రక్షించేందుకు శనివారం ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు పడవలో తరలిస్తుండగా,



రిక్షాపై మృతదేహాన్ని తరలిస్తున్న కుటుంబ సభ్యులు

చిట్టినగర్ పాలఫ్యాక్టరీ వద్ద విజయవాడ రూరల్ మండలం నున్నకు చెందిన దార శ్యామ్ అనే వ్యక్తి గల్లంతుకాగా, సోమవారం ఆయన మృతదేహం జక్కంపూడి పొలాల్లో లభ్యమైంది. కంచికచర్ల మండలం గొట్టుముక్కలకు చెందిన గాలి సత్యం (64) కూలిపనులకు వెళ్లి తిరిగి వస్తుండగా, గుడి వాగులో పడి మరణించాడు. నాలుగు రోజుల క్రితం మైలవరం నియోజకవర్గంలో ఐదుగురు మరణించిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. ఆగస్టు 31న మైలవరం మండలం అనంతవరం గ్రామానికి చెందిన తుపాకుల వెంకటేశ్వరరావు(63) గేదలను తోలుకెళ్లి వరద ప్రవాహంలో గల్లంతయ్యాడు. ఆయన మతదేహం పొందుగల గ్రామ శివారు పంగిడి చెరువులో దొరికింది. అలాగే వెల్వడం గ్రామానికి చెందిన శెట్టిపల్లి కష్ణారెడ్డి (47) బుడమేరు వరద ఉధతికి కొట్టుకుపోయాడు. బుడమేరులో సోమవారం మృతదేహం దొరికింది. జి.కొండూరు మండలం గంగినేని గ్రామానికి చెందిన నల్లబోయిన వెంకటేశ్వరరావు ఇంటి గోడ కూలి మరణించాడు. హెచ్ ముత్యాలంపాడు గ్రామానికి చెందిన చల్లా మోహనకష్ణ పశువులను ఇంటికి తోలుకోస్తూ వరద ప్రవాహంలో గల్లంతయ్యాడు. మతదేహం ఆదివారం సాయంత్రం లభించింది. అదే గ్రామానికి చెందిన పైడి పాముల పార్వతి(27) ఆదివారం గ్రామ శివారున వరద ప్రవాహంలో ట్రాక్టర్ బోల్తా పడటంతో గల్లంతైంది. గల్లంతైన ప్రదేశం నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో మృతదేహం లభించింది. ఇలా అనేక మంది మృతదేహాలు తరచూ వెలుగు చూస్తుండడంతో తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది. దీనిపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా, ఎవరూ స్పందించలేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



ముంపులో సింగ్‌నగర్ బాధితులు

ఆహారం, మంచినీటి కోసం పాట్లు

సహాయక చర్యలు ముమ్మరం

ఇంకా వరద నీటిలోనే ప్రజలు అల్లాడుతున్నారు. బుడమేరు, కృష్ణానది వరదల కారణంగా ముంపునకు గురైన ప్రాంతాల్లో బాధితులు ఆర్తనాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. వరదలు తగ్గుముఖం పట్టినా ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఇంకా జలదిగ్బంధనంలోనే ఉన్నాయి. అధికారులు సహాయక చర్యలను ముమ్మరం చేశారు. విజయవాడలో వరద బాధితులకు డ్రోన్లు, హెలికాప్టర్లు, బోట్లు సాయంతో ఆహారం, మంచినీరు, పాలు పంపిణీ చేస్తున్నారు. అయినా అత్యధిక ప్రాంతాల్లో ఆహారం అందలేదని బాధితులు వాపోతున్నారు. ఆహార పొట్లాలు వీధుల్లో లోపలికి చేరడంలేదని బాధితులు వాపోతున్నారు. ఆహార పొట్లాలు, పాలు, మంచినీళ్లు, పండ్లు వంటివి సిద్ధం చేసి.. లారీలు, ట్రాక్టర్లతో ముంపు ప్రభావిత ప్రాంతాలకు తరలించారు. అక్కడి నుంచి ఆయా వస్తువులను ముంపు బారిన ఉన్న నివాసితుల వద్దకు అధికార యంత్రాంగం బోట్లలో చేరవేయాలి. కానీ వరద శివారు ప్రాంతాలకు అవి చేరడంలేదు. పంపిణీ బందాలు ప్రధాన రహదారులను దాటి ముంపు బారిన ఉన్న వీధుల్లోపలికి రావట్లేదని, తాము ఆకలితో అల్లాడిపోతున్నామని బాధితులు వాపోతున్నారు. ఇళ్లల్లో యువకులుంటే వారు ఎలాగోలా బయటకొచ్చి మిగతా కుటుంబ సభ్యుల కోసం ఆహారాన్ని తీసుకెళ్లగలుగుతున్నారు. వద్ధులు, మహిళలు, నడివయస్కులు ఉన్నవారు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వాహనాల్లో పంపే వస్తువులు ముంపు ప్రాంతాల సమీపానికి చేరుకోగానే వాటికోసం జనం ఎగబడుతున్నారు. కొన్ని సందర్భాల్లో వాహనంపైకి ఎక్కి ఎవరికి దొరికినవి వారు లాగేసుకుంటున్నారు. ఈ పంపిణీని క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉంది. తమను రక్షించండి అంటూ పలువురు బాధితులు వేడుకుంటున్నారు. వరద వచ్చి మూడు రోజులైనా అధికారులు తమవైపు చూడడంలేదని వాపోతున్నారు. తమ వారి ఫోన్లు పని చేయటం లేదని బంధువుల ఆందోళన చెందుతున్నారు. అనేక మంది బాధితులు భవనాలపైనే బిక్కు బిక్కు మంటూ గడుపుతున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఇంకా విద్యుత్ పునరుద్ధరణ జరగలేదు. ముందుజాగ్రత్త చర్యగా మూడు రోజుల క్రితమే అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

బ్యారేజి వరద తగ్గుముఖం

ఇన్‌ఫ్లో 5.04 లక్షల క్యూసెక్కులు

ప్రజాశక్తి - విజయవాడ : ప్రకాశం బ్యారేజికి వరద క్రమంగా తగ్గుముఖం పడుతోంది. మంగళవారం రాత్రి 10 గంటల సమయానికి 5.04 లక్షల క్యూసెక్కుల వరద నీరు ఎగువ ప్రాంతం నుంచి ప్రకాశం బ్యారేజికి వచ్చి చేరుతోంది. ఇరిగేషన్ అధికారులు బ్యారేజికి చెందిన మొత్తం 70 గేట్లను పూర్తిస్థాయిలో ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీనిలో 500 క్యూసెక్కుల నీటిని పంపుతున్నారు. బ్యారేజికి రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది.

ఇంకా ముంపులోనే పంటలు

50 పునరావాస శిబిరాల్లో 10,738 మంది

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

కృష్ణానది వరద వరద తీవ్రత తగ్గుముఖం పట్టింది. సోమవారం అవనిగడ్డ-విజయవాడ కరకట్ట రోడ్డుకు ఆనుకుని వరద నీరు ప్రవహించింది. కరకట్ట భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. అయితే మంగళవారం నాటికి ఉధృతి తగ్గింది. దీంతో తీర ప్రాంత ప్రజలు, అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది. అయితే లంక గ్రామాలు, పరీవాహక ప్రాంతంలోని కరకట్ట లోపల గ్రామాల్లో గృహాలు, పంటలు ముంపులోనే ఉన్నాయి. పంటలు మునిగిపోయి చెరువుల్లా కనిస్తున్నాయి. వరద పంటలపై నుండి నీరు ప్రవహించడంతో నష్టం తీవ్రత ఎక్కువగా ఉంటుందని రైతులు వాపోతున్నారు. బందరు డివిజన్‌లో 19, వుయ్యూరు డివిజన్‌లో 11, గుడివాడ డివిజన్‌లో 20 పునరావాస శిబిరాల్లో 10,738 మందికి పునరావాసం కల్పించారు.

ప్రాథమికంగా నష్టం ఇలా!

జిల్లాలోని 15 మండలాల్లో 50 గ్రామాలు వరద ప్రభావానికి గురయ్యాయి. 28 గృహాలు దెబ్బతిన్నాయి. 20 పంచాయతీరాజ్ రోడ్లు , ఒక ఆర్ అండ్ బి రోడ్డు దెబ్బతిన్నాయి. 12 రోడ్లమీదుగా నీరు ప్రవహిస్తోంది. 30,933 హెక్టార్లలోని వ్యవసాయ పంటలు, 3,528 హెక్టార్లలోని ఉద్యాన పంటలు మంగళవారం సాయంత్రానికి కూడా ముంపులో ఉన్నట్లు జిల్లా యంత్రాంగం తెలిపింది. 10 విద్యుత్ సబ్‌స్టేషన్‌లు, 33 కెవి ఫీడర్లు, మరో 10, 11 కెవి ఫీడర్లు 31 వరద ముంపుకు గురయ్యాయి. 166 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి.

ప్రతిఒక్కరికీ భోజనం అందాలి : కమిషనర్

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధనచంద్ర మంగళవారం ఉదయం కండ్రిక జంక్షన్, అజిత్ సింగ్ నగర్ ప్రాంతాలు పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడ ఉన్న ప్రజలకు బోట్ సహాయం అందుతుందా లేదా, భోజనం బోట్ల ద్వారా కానీ, ట్రాక్టర్ ద్వారా కానీ ప్రజలందరికీ అందుతున్నాయా లేదా వార్డ్ సెక్రటరీలు అప్రమత్తంగా ఉన్నారా లేదా, ప్రజలకు ఇంకేమైనా అవసరం ఉందా అన్న అంశంపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫ్లై ఓవర్ పైన పంపిణీ చేశాక మిగిలి ఉన్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రపరుస్తుండాలని, పారిశుధ్య నిర్వహణ కూడా ఖచ్చితంగా జరిగేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు.

వరద ఉధృతికి తండ్రి, కుమారుడు మృతి

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: బుడమేరు వరద ఉధృతికి డైరీ ఫామ్ నిర్వహిస్తున్న తండ్రి, కుమారుడు మరణించారు. గుణదలలో నివాసం ఉంటున్న కొల్లిపర వేంకటేశ్వరరావు (63), ఆయన కుమారుడు సందీప్ (35) ఇన్నర్ రింగ్ రోడ్డు వద్ద డైరీ ఫామ్ నిర్వహిస్తున్నారు. విధుల్లో భాగంగా ఆదివారం సాయంత్రం వెళ్లి అక్కడే ఉన్నారు. సోమవారం కూడా రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా కొద్ది దూరంలో ఇద్దరు చనిపోయి ఉన్నట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు వారి మృతదేహాలను ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ట్రాఫిక్ డిసిపిగా కృష్ణమూర్తినాయుడు

ప్రజాశక్తి-విజయవాడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖలో పోలీస్ అధికారులుకు కల్పించిన పదోన్నతులలో భాగంగా ఎన్‌టిఆర్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులుకు సర్వీసు ప్రాతిపదికన అర్హతను బట్టి నాన్ కేడర్ యస్‌పిగా ఉద్యోగోన్నతి కల్పించడం జరిగిది. ఈ నేపథ్యంలో ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమీషనరేట్ ఇన్ చార్జ్ అడ్మిన్ డిసిపిగా పని చేస్తున్న ఎమ్.క్రిష్ణమూర్తి నాయుడు అడిషనల్ యస్.పి. నుండి నాన్ కేడర్ ఎస్‌పిగా ఉద్యోగన్నతి పొంది ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో ట్రాఫిక్ డిసిపిగా బదిలీ అయినారు.ఈ సందర్భంగా వ్యాస్ కాంప్లెక్సన ట్రాఫిక్ డిసిపి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబును మర్యాద పూర్వకంగా కలిశారు.

నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవాలి : వడ్డే

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : వరద ప్రవాహానికి సర్వం కోల్పోయిన ప్రతి ఒక్క కుటుంబాన్ని, ప్రతి ఒక్క రైతును ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి వడ్డే శోభనాద్రిశ్వరరావు ప్రభుత్వాన్ని ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం తోట్లవల్లూరు మండల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పునరావాస కేంద్రంలో వరద బాధితులతో వడ్డే శోభనాద్రి శ్వరరావు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని రొయ్యూరు నుండి ఐలూరు వరకు కంద, పసుపు, అరటి రైతులు చాలా పెద్ద ఎత్తున నష్టపోయారని అన్నారు.

వరద బాధితులకు 'విక్కుర్తి' సాయం

ప్రజాశక్తి-అవనిగడ్డ : దివిసీమలో కష్ణా నదికి వరద పోటు ఎత్తడంతో నదీ గర్భంలోని గ్రామాలన్నీ జలమయం బాధితులకు ప్రభుత్వం సహాయంతో పాటు తాను కూడా ఉన్నానంటూ విపత్తులో ఉన్న బాధితులకు ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ తన వంతు సహాయం అందిస్తున్నారు. నియోజకవర్గంలోని లంక గ్రామాలైన కే కొత్తపాలెం బొబ్బర్లంక, పులిగడ్డ, రేగులంక, పల్లెపాలెం, దక్షిణ చిరువాలంక, ఎడ్ల లంక నా కాయలంక ప్రాంతాల్లో వరద తాకిడికి గురైన ప్రాంతాలను పరిశీలించి వందలాది ఇల్లు నీటి మునగగా ఆ ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకొని ఆహార పట్నాలు పంపిణీ చేస్తూ బాధితులకు అండగా నిలుస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఆహారం అందటం ఆలస్యమైన సందర్భాల్లో వెంటనే బాధితులకు బిస్కెట్లు బ్రెడ్లు రప్పించి పంపిణీ చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో పర్యటించిన సందర్భంలో ప్రజల నుండి సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. వరదల సమయంలో రాజకీయాలకు అతీతంగా శ్రీనివాస్ చేస్తున్న సేవలు పట్ల ప్రజల హర్ష వ్యక్తం చేస్తున్నారు



వరద బాధితులకు ఆహారం అందిస్తున్న విక్కుర్తి శ్రీనివాస్

ఎకరానికి రూ.20వేలు నష్టపరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి - గుడివాడ : వర్షాలకు పంట పొలాలు పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులకు ఎకరానికి రూ.20వేలు నష్టపరిహారం ఇవ్వాలని రైతు సంఘం కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు డిమాండ్ చేశారు. మంగళవారం గుడివాడ సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదు రోజుల నుంచి కూడా నీరు తగ్గకపోవడం వలన నీటిలో మునిగిపోయి పంట పొలాలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం ఈ క్రాప్ తో నిమిత్తం లేకుండా రైతుల ఆదు కోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం గుడివాడ పట్టణ కార్యదర్శి ఆర్ సిపి రెడ్డి , రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఉమామహేశ్వరరావు, నందివాడ మండలం రైతు సంఘం అధ్యక్షులు పలనాటి ప్రసాదు, పెద్దిపాడు మండలం రైతు సంఘం కార్యదర్శి నాగి నేని వెంకట కష్ణారావు , రేపానికొండ, పి రజిని పాల్గొన్నారు.

అలాగే గుడివాడలోని న్యూ ఇందిరా నగర్ కాలనీలో మురుగునీరు పారుదల జరిగేలా అధికారులు శ్రద్ధ తీసుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం న్యూ ఇందిరా నగర్ కాలనీలో ఆయన పర్యటించారు.

యువతి ప్రాణం కాపాడిన లైఫ్ షేర్ బ్లడ్ సెంటర్

ప్రజాశక్తి-గన్నవరం : దేశంలోనే అత్యంత తక్కువ మందికి ఉండే బాంబే ఫినో రక్తాన్ని లైఫ్ షేర్ బ్లడ్ సెంటర్ ద్వారా మంగళవారం విజయవాడకు చెందిన షేక్ అసిమా యువతికి ఇచ్చి ఆమె ప్రాణాలు కాపాడారు. విజయవాడలో శ్రీవేములపల్లి కోదండరామయ్య ట్రస్టుకు చెందిన లైఫ్ షేర్ సెంటర్ రక్తం అందక ఇబ్బంది పడుతున్న వారికి సహకారం అందిస్తోంది. కొద్ది రోజుల క్రితం రక్తహీనత సమస్యతో సూర్యారావుపేటలోని సరోజినీ హాస్పిటల్ లో అసీమా చేరింది. ఆమె బ్లడ్ గ్రూప్ చాలా అరుదు కావడంతో ఆంధ్ర రాష్ట్రంలో ఏ బ్లడ్ సెంటర్లో అడిగిన అందుబాటులో లేదని సమాధానం వచ్చింది. హాస్పటల్ యాజమాన్యం లైఫ్ షేర్ బ్లడ్ సెంటర్‌ను సంప్రదించింది. దీనిపై స్పందించిన సెంటర్ నిర్వాహకులు హైదరాబాద్‌లోని పలు బ్లడ్ సెంటర్లను సంప్రదించారు. ఎక్కడ అందుబాటులో లేదు. దీనిపై వాలంటీర్ల ద్వారా విచారణ చేయగా మహేష్ అనే యువకుడు బాంబే ఫినో గ్రూపు రక్తం కలిగి ఉండడాన్ని తెలుసుకున్నారు. వెంటనే అతన్ని సంప్రదించి సమస్య చెప్పగా మహేష్ రక్తాన్ని ఇవ్వగా వాహనంలో విజయవాడ రప్పించి రోగికి ఎక్కించేందుకు సహాయపడ్డారు. రక్తం సమస్యతో బాధపడుతున్న వారికి లైక్ షేర్ బ్లడ్ సెంటర్ అనేక రకాలుగా సహాయం అందిస్తుంది.

వరద బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి మోపిదేవి : మచిలీపట్నం మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణ, అవనిగడ్డ నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ మంగళవారం మోపిదేవి మండలంలో పర్యటించారు. మోపిదేవి మండలం కే.కొత్తపాలెం, బొబ్బర్లంకల్లో కరకట్టపై వరద బాధితులను పరామర్శించారు. కరకట్టపై ఉన్న వాళ్ళు అందరూ పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. అలాగే మోపిదేవి మండలంలోని కే కొత్తపాలెం, బొబ్బర్లంక, మోపిదేవి వార్పుల వద్ద వరద ఉధతికి ఆయా గ్రామాలలోని గహాలు నీట మునిగాయి. దీనితో చల్లపల్లి, పాత మాజేరు గ్రామాలకు చెందిన జనసైనికులు తమ వంతుగా విజిటబుల్ బిర్యానీ ప్యాకెట్లను మంగళవారం బాధితులకు జనసేన మోపిదేవి మండల అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్ చేతుల మీదగా పంపిణీ చేశారు.

జెండా ఆవిష్కరణ

పామర్రు : పామర్రులో 1969వ సంవత్సరంలో నిర్మించిన అమరవీరుల స్థూపం 55 సంవత్సరాలు అయిన సందర్భంగా మంగళవారం సభ నిర్వహించారు. ముందుగా బరిగల భీమేశ్వర జెండా ఎగురువేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పామర్రు కన్వీనర్ ఓ గంగాధర్ ప్రసాద్, ముళ్ళపూడి విల్సన్, కాటూరి నాగభూషణం, ప్రజానాట్య మండలి కళాకారులు టి ఆదిశేషు, జువ్వనపూడి రామస్వామి, సిహెచ్ వెంకటేశ్వరరావు,శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నూతన ప్లాంట్‌తో పాల సేకరణ

ప్రజాశక్తి-గన్నవరం : కృష్ణాజిల్లా బాపులపాడు మండలం వీరవల్లి గ్రామంలో కృష్ణా మిల్క్ యూనియన్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయకుంటే ప్రస్తుత వరద పరిస్థితుల్లో పాడి రైతులకు హాలిడే ప్రకటించాల్సి వచ్చేదని కృష్ణా మిల్క్ యూనియన్ జిల్లా డైరెక్టర్లు పాలడుగు వెంకట రామ వరప్రసాద్(నాని), పలగాని కొండలరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల కారణంగా చిట్టి నగర్ లోని విజయ ప్లాంట్ లోకి నీరు వచ్చి మూతపడిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు. కృష్ణ మిల్క్ యూనియన్ ముందు చూపుగా బాపులపాడు మండలం వీరవల్లి గ్రామంలో నూతన ప్లాంట్ ఏర్పాటు చేయడం వల్ల పాల సేకరణకు, పంపిణీకి ఎటువంటి ఇబ్బంది రాలేదన్నారు.

బాలింత, పసికందును రక్షించిన సిపి

ప్రజాశక్తి-విజయవాడ: పది రోజుల పసిపాపను నగర పోలీసు కమిషనర్ ఎస్‌వి రాజశేఖర్‌బాబు స్వయంగా రక్షించి, పునరావాస కేంద్రానికి పంపించారు. ఈ సంఘటన మంగళవారం జరిగింది. నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు వరద ఉధృతిని పర్యవేక్షిస్తూ ఎన్.డి.ఆర్.ఎఫ్., ఎస్.డి.ఆర్.ఎఫ్ బందాలు, ఫైర్ , పోలీసు లా అండ్ ఆర్డర్ అధికారులు , సిబ్బంది సహకారంతో లోతట్టు ప్రాంతాలలో సహాయ కార్యక్రమాలు అందించే విధంగా మరియు నీట మునిగిన ప్రాంతాల నుండి ప్రజలను రక్షించి పునరావాసాలకు తరలించే సహాయక చర్యలను చేపట్టడం జరుగుతుంది. ఈ క్రమంలో రెండవ రోజు సింగ్ నగర్, నున్న పరిసర ప్రాంతాలు ఇబ్రహీంపట్నం ఏరియాలలోని నీట మునిగిన ప్రాంతాల్లోకి స్వయంగా వెళ్లి క్షేత్రస్థాయిలో అధికారులకు సూచనలిస్తూ సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ క్రమంలో వరదలో చిక్కుకున్న 10 నెలల బాలికను వారి కుటుంబ సభ్యులను బోట్ సహాయంతో స్వయంగా బయటకు తీసుకురావడం జరిగింది. మరియు, వద్దులను, మహిళలను స్వయంగా రక్షించి పునరావాస కేంద్రాలకు తరలించడం, సహాయక చర్యలలో స్వయం గా పాల్గొనడం జరిగింది. భవానీపురం, చిట్టీనగర్ మరియు వై.ఎస్.ఆర్ కాలనీ ఏరియాలలోని నీట మునిగిన ప్రాంతాలను పరిశీలించి వారికి అందుతున్న సహాయక చర్యల గురించి అడిగి తెలుసుకుని అధికారులకు తగు సూచనలు అందించారు. అన్నిరకాల సహాయక చర్యలు మరియు వరదనీరు తగ్గడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందని, వరదనీరు క్రమంగా తగ్గుముఖం పడుతుందని, లోతట్టు ప్రాంతల ప్రజలు , కొండ ప్రాంతాల్లో నివసించేవారు, మొదలగు ప్రాంతాల్లో నివసిస్తున్న వారు సైతం ముందస్తుగా చర్యలు తీసుకుని సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని పోలీస్ కమిషనర్ తెలియజేశారు.



వరద నీటిలోనే పంట పొలాలు

- దిక్కుతోచని స్థితిలో రైతులు
- వరద బాధితులకు పలువురు సాయం



గన్నవరం మండలం అప్పారావుపేట వద్ద ఏలూరు కాల్వకు పడిన గండి

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం విమానశ్రయం నుంచి వరద బాధితుల సహాయక చర్యల్లో ఆరు హెలికాప్టర్లు ద్వారా ఆహారం, తాగునీరు అందిస్తున్నారు. బోట్లు చేరుకోలేని ప్రాంతాలకు డ్రోన్ల ద్వారా ఆహార సరఫరా చేస్తున్నారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ విజ్ఞప్తి మేరకు జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీకి ప్రత్యేక హెలికాప్టర్ లో 2,500 ఆహార పొట్లాలు చేరవేశారు. విజయవాడ పరిధిలో వరద ముంపుకు గురైన 32 వార్డుల్లో సీనియర్ ఐఎఎస్ అధికారుల పర్యవేక్షణలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. విజయవాడ డివిజన్ పరిధిలో 70 పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న 14,452 మంది నిరాశ్రయులకు ఆహారం అందిస్తున్నారు.

గూడవల్లి వద్ద బుడమేరు కాలువ కట్ట తెగి జాతీయ రహదారిపై కి, చైతన్య, నారాయణ కాలేజీల్లోకి నీరు చేరడంతో విద్యార్థులను ఇళ్ళకు పంపిస్తున్నారు. నిడమానూరు నుండి గూడవల్లి వరకు జాతీయ రహదారిపైకి వరద వస్తోంది. రామన్ భవన్ 2 కాలేజీలోకి వరద నీరు ప్రవేశించింది..అలాగే గూడవల్లి వద్ద జాతీయ రహదారిపై వస్తున్న బుడమేరు నీటితో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. విజయవాడ రూరల్ మండలం అంబాపురంలో మూడు రోజులుగా జల దిగ్బంధంలో గ్రామస్తులు ఉన్నారు. ఇదిలా ఉండగా కేసరపల్లి గ్రామంలో వరద ఉధృతి ఇంకా కొనసాగుతోంది. వరద బాధితులకు అన్ని రకాలుగా సదుపాయం కల్పించాలని గుడివాడ ఆర్డీవో పద్మావతి అధికారులను ఆదేశించారు. మంగళవారం వరదలో చిక్కుకున్న గన్నవరం మండలం జక్కులనెక్కల గ్రామంలో పర్యటించారు.

మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వరద బాధిత ప్రాంతాల్లో 8 లక్షలకు పైగా ఆహార పొట్లాలు పంపిణీ చేసినట్లు ఫుడ్ సెక్షన్ ఇంచార్జ్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. వరద బాధితులకు అందించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న ఆహారాన్ని విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం కు తరలించి అక్కడి నుంచి వరద బాధిత ప్రాంతాలకు పంపిణీ చేస్తున్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు :** మండలంలోని వెల్దిపాడు, ఎలుకపాడు, ఆముదాలపల్లి, గారపాడు, కొయ్యగూరపాడు గ్రామాలు నీట మునిగాయి. తెన్నేరు వద్ద బుడమేరు కట్ట తెగిపోవడంతో వరద నీరు ఉదతంగా వెల్దిపాడు గ్రామానికి ప్రవహిస్తోంది. గ్రామంలోనికి వెళ్లడానికి దారి లేకపోవడంతో జెసిబి సహాయంతో అధికారులు గ్రామంలోకి వెళ్లి వారిని తరలిస్తున్నారు. సిపిఎం నాయకులు వరద బాధితులను పరామర్శించారు. అనంతరం అధికారులను కలిసి ముంపు ప్రాంతాల్లో ఉన్న వారికి పునరావాసం ఏర్పాటు చేయాలని కోరారు. **పెనమలూరు :** సిపిఎం వాలంటరీ సర్వీస్ రాయల్ క్లబ్ విజయవాడ వారి ఆర్థిక సాయంతో వరద ముప్పుకు గురైన చింతలకట్ట, వజ్ర కాలనీ. కొండనక ప్రాంతం, పెద్దపులి పాకలో ఉన్న వరద బాధితులకు భోజనం ప్యాకెట్లు, మంచినీటి ప్యాకెట్లు మంగళవారం అందించారు. గన్నవరం డిఎస్పి చాలసాని శ్రీనివాసరావు చేతుల మీదగా యనమల కుదురు హైస్కూల్లో ఉన్న వరద బాధితులకు ఆహారం ప్యాకెట్లు అందించారు. పెనమలూరు మండలం సిపిఎం కార్యదర్శి ఉపాడ త్రిమూర్తులు, పెనమలూరు ఎస్ఐ సుధాకర్, ఎస్కె ఖాసిం, ఎస్కె మస్తాన్ వలీ, పాల శీను, పి లక్ష్మీనారాయణ, సిహెచ్ రాంబాబు, విసం సోమశేఖర్, పి పాత లక్ష్మి. సిహెచ్ భవాని, టి లావణ్య పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మోపిదేవి :** మోపిదేవి మండలం కొత్త పాలెంలో కరకట్ట వెంబడి నిరాశ్రయులుగా ఉన్న వరద బాధితులను ప్రజాసంఘాల నాయకులు మంగళవారం సాయంత్రం పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సిపిఎం అనుబంధ సంఘాలైన రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం సూర్య నారాయణ, వై కేశవరావు, కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యద్దనపూడి మధు, వ్యవసాయ కార్మిక సంఘం చల్లపల్లి మండల అధ్యక్షులు మేడిపల్లి వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎండి కరీముల్లా తదితరులు పరామర్శించారు. వరద నీరు తగ్గిపోయిన తర్వాత ప్రభుత్వ యంత్రాంగం పంట నష్టం అంచనా వేసే క్రమంలో అప్రమత్తంగా ఉండి ఉద్యాన పంటలు, వాణిజ్య పంటలు వేరువేరుగా నష్ట వివరాల నమోదు చేయాలని నాయకులు అన్నారు. మోపిదేవి మండల సిపిఎం కార్యదర్శి బండి ఆదిశేషు, సిఐటియు అధ్యక్షులు చాట్రగడ్డ రాజశేఖర్ బెజవాడ నాగేశ్వరావు కర్ర వెంకటేశ్వరావు తదితర స్థానిక నేతలు కూడా పాల్గొన్నారు. అలాగే మోపిదేవి మండలంలోని కే కొత్తపాలెం, బొబ్బర్లంక, మోపిదేవి వార్పు లలో నిరాశ్రయులైన వరద బాధిత చిన్నారులకు పామర్రుకు చెందిన ఎబినేజర్ మినిస్ట్రీస్ అధ్యక్షులు జి స్పర్జన్ సహకారంతో అల్పాహారాన్ని అందజేశారు. పాస్టర్ జి ప్రదీప్ ఆధ్వర్యంలో పాస్టర్ జి ఇస్సాకు పర్యవేక్షణలో ఆయా గ్రామాలలోని 500 మంది చిన్నారులకు బిస్కెట్ ప్యాకెట్లు, ఎనర్జీ డ్రింక్, పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.

మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయం తరుపున మంగళవారం దేవస్థానంలో తయారుచేసిన భోజనం ప్యాకెట్లను ఆలయ సహాయ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో విజయవాడ తరలించారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** వరద బాధితులకు సహాయం చేయటం మనందరి బాధ్యత అని పామరు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మంగళవారం పమిడిముక్కల మండలంలోని వరద బాధితులకు ఆహారం అందజేశారు. టిడిపి పార్టీ నాయకులు లింగమనేని రామారావు, జక్క శ్రీనివాసరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడివాడ:** నందివాడ మండలం బుడమేరు పరివాహక ముంపు బాధిత గ్రామాల ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము టిడిపి నేతలకు ఆదేశించారు. ఎమ్మెల్యే రాము ఆదేశాలతో నందివాడ మండలంలోని ముంపు గ్రామాలైన జొన్నపాడు, రామాపురం, అరిపిరాల, చేదుర్తిపాడు, పెదలింగాల, చిన్న లింగాల, పుట్టగుంట గ్రామాల్లో పార్టీ నేతలతో కలిసి టిడిపి నాయకుడు కామేపల్లి తులసి బాబు మంగళవారం పర్యటించారు. బాధితుల ఇళ్లకు వెళ్లి ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. చేదుర్తిపాడు గ్రామంలో బుడమేరుకు గండిపడగా స్థానికులతో కలిసి గండిని పూడ్చారు.

ఇందిరానగర్ కాలనీ వాసుల ధర్నా

గుడివాడ ఇందిరానగర్ కాలనీలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాలనీ నీట మునిగి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామంటూ గుడివాడ విజయవాడ రహదారిలో బేతవోలు పెద్దపేట వద్ద కాలనీవాసులు ధర్నాకి దిగారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షపు నీరు బయటకు పోయే పరిస్థితి లేక కాలనీలోనే నిలిచిపోయాయని దీనివల్ల కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నామన్నారు. సుమారు గంట పాటు జరిగిన ఈ ధర్నా వలన గుడివాడ విజయవాడ రహదారిలో సుమారు కిలోమీటర్ మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. **ప్రజాశక్తి-తోట్లవల్లూరు :** తోట్లవల్లూరులోని కృష్ణానది పాయలో వరద కొనసా గుతూనే ఉంది. పంటలు పూర్తిగా నీటి మునిగి పోయాయి. పసుపు, కంద,అరటి వంటి పంటలు నీటి మునిగి పూర్తిగా పనికిరాకుండా పోయాయని రైతులు వాపోతున్నారు. మండలంలో ఎనిమిది లంక గ్రామా ల్లోని ప్రజలను అధికారులు ప్రజాప్రతినిధులు పడవలలో పునరావాస కేంద్రాలకు తరలించారు. రొయ్యూరు గ్రామ టిడిపి నాయకులు ఉప్పులూరి గోపాలకష్ణ సహకారంతో తోడేళ్లదిబ్బ లంక గ్రామ ప్రజల పశువులకు అవసరమైన దాణా, వరిగడ్డి మేతను అందజేశారు. పామర్రు నియోజకవర్గ ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా చేతుల మీదగా రైతులకు దాణను, వరి మేతను అందించారు. **ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ :** అధిక వర్షాల ప్రభావంతో వస్తున్న వరద ప్రభావంతో మచిలీపట్నం మండలంలోని పలు గ్రామాల్లో వరి పొలాలు, వేరుశెనగ పొలాలు ముంపు బారిన పడ్డాయి. మండలంలో సుమారు 7,522 హెక్టర్ లలో వరి,4 వందల హెక్టర్ లలో సాగు చేస్తున్నారు. గత ఇరవై రోజులుగా క్రితం సాగునీరు అందక ఇబ్బంది పడ్డ రైతులు ఎలాగోలో పొలాలను కాపా డుకుంటూ వచ్చారు. ఇప్పుడు అనావష్టితో కుదేలవుతున్నారు. ఇప్పటికే వేలాది రూపాయలు ఖర్చు చేసిన రైతులు మొక్కలు దక్కుతాయే లేదోనని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఇప్పటికే కొన్ని దెబ్బ తిన్న వెద పొలాలలో రెండవసారి నాట్లు వేయడం జరిగిందని ఖర్చు రెండింతలు అయ్యిందని రైతులు తెలుపుచున్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** మహా ఉగ్రరూపం దాల్చిన కష్ణమ్మ మంగళవారానికి కొద్దిగా శాంతించడంతో దివిసీమ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు'. ఎన్నడూ లేనివిధంగా 11 లక్షల 50వేల క్యూసెక్కుల వరకు వరదరావడంతో ఎక్కడ కట్టలు తెగిపోతాయని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీశారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అమెరికాలో ఉన్నప్పటికీ ఆయన అక్కడనుండి కూటమి పార్టీల నాయకులకు అధికారులకు సూచనలిస్తూ కరకట్ట పటిష్టతపై అప్రమత్తం చేశారు. మరోవైపు నాగాయలంక మండలంలో కూడా మండల పరిధిలోని ఎదురు మొండి దీవులలో గ్రామాలైన ఎదురు మొండి, ఈల చెట్లదెబ్బ, యేసు పురం నాచుగుంట గ్రామాలలో వరద నీరు తగ్గు ముఖం పడుతుంది. కాగా జింకపాలెం గ్రామానికి వరద ప్రభావం వల్ల రోడ్డు దెబ్బతినడంతో రెవెన్యూ అధికారులు గ్రామస్తులతో కలిసి తాత్కాలికి రహదారి నిర్మాణం చేపట్టారు. కృష్ణా నదికి వచ్చిన తీవ్ర వరదల వల్ల నిర్వాసితులైన ప్రజలకు ప్రభుత్వం ద్వారా అందుతున్న సహాయక చర్యలు విజయవంతంగా కొనసాగు తున్నాయని మచిలీపట్నం మాజీ పార్లమెంట్ సభ్యులు కొనకళ్ళ నారాయణరావు ప్రశంసించారు.**ప్రజాశక్తి-కంకిపాడు :** కంకిపాడు మండలంలోని బుడమేరు కట్ట తెగడంతో ఉప్పులూరు, మంతెన, తెన్నేరు గ్రామాల్లో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. మంతెన గ్రామంలో పెనమలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రసాద్ పర్యటించి ప్రజలకు ఆహార పదార్థాలు అందజేశారు. అలాగే ముంపు ప్రాంతాల్లో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఆర్డిఓ రాజు, తాసిల్దార్ భవన్నారాయణలు కూడా పర్యటించి ప్రజలకు భరోసా ఇచ్చారు.**పజాశక్తి- పెదపారుపూడి :** మండలంలో వర్షాలకు నీట మునిగిన వరి పొలాలను పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. మండలంలోని మోపర్రు, తమ్మలం పాడు, దోసపాడు, నాగాపురం, వెంట్రప్రగడ, వింజిరం పాడు గ్రామాలలో నీట మునిగిన వరి పొలాలను పరిశీలిచి మాట్లాడారు. అలాగే మండలంలోని జమీదెంట కుర్రు, వింజనంపాడు ,మోపర్రు,గ్రామాలలో భారీ వర్షాలకు నీటమునిగిన వరద బాధిత మహిళలకు వర్ల కుమార్ రాజా చీరలు, నిత్యవసరాలు పంపిణీ చేశారు. **పామర్రు:**ఇటీవల కురిసిన భారీ వర్షాలు ఉరుటూరు గ్రామంలో నీట మునిగిన పంట పొలాలను సిపిఎం,కౌలురైతు సంఘ నాయకులు పరిశీలించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం చెల్లించాలని కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి రంగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం కన్వీనర్ ఓ గంగాధర్ ప్రసాద్, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి కే లక్ష్మణరావు, కెవిపిఎస్ జిల్లా నాయకులు ముళ్ళపూడి విల్సన్, రజక సంఘం జిల్లా కార్యదర్శి కే నాగభూషణం పాల్గొన్నారు.



మచిలీపట్నంలో చెరువులా మారిన పంటపొలాలు

పారిశుధ్య పనులు చేపట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో వరద నీరు తగ్గిపోతున్న దష్ట్యా వరద ప్రభావిత పట్టణాలు, గ్రామాల్లో పారిశుధ్యం పనులు ముమ్మరంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని కలెక్టరేట్ విసీ హాల్లో జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులు, క్షేత్రాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వరద పరిస్థితులపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కష్ణా నదికి వరద నీరు తగ్గుముఖం పట్టిందని ప్రస్తుతం 8.64 లక్షల క్యూసెక్కుల వరద నీటీ ప్రవాహం ఉందన్నారు. జిల్లాలో వరద ప్రభావిత పట్టణాలు గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా సజావుగా పారిశుధ్యం ఏర్పాట్లు చేపట్టాలన్నారు. అన్ని మురికి కాలువలలో దోమల నివారణ మందు పిచికారి చేయాలన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, ఒక కిలో చక్కెర, ఒక కిలో కందిపప్పు,ఒక లీటరు పామాయిల్ సజావుగా ఇంటింటికి నేరుగా పంపిణీ చేయాలన్నారు. మత్స్యకారులు, చేనేత కార్మికులకు 50 కిలోల బియ్యం అందజేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, డి ఆర్వో జి శ్రీదేవి, జెడ్పీ సీఈవో ఆనంద్ కుమార్, డి ఎం హెచ్ ఓ డాక్టర్ గీతాబాయి, డిఎస్ఓ పార్వతి, ఆర్ అండ్ బి ఈఈ శ్రీనివాసరావు, ఏపీఎంఐపి పిడి విజయలక్ష్మి, పశుసంవర్ధక అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వాటర్ ప్యాకెట్లు అందజేత : విజయవాడలో సంభవించిన అకాల వర్షాలు, వరదల కారణంగా స్తంభించిన జనజీవనాన్ని దష్టిలో ఉంచుకొని తమ వంతు సహాయం కింద మచిలీపట్నం సచివాలయం సెక్రటరీలు, రెవెన్యూ ఆఫీసర్, వెంకటేష్ ఆధ్వర్యంలో ఒక మిని ట్రక్ మంచి నీటి వాటర్ ప్యాకెట్లను సహాయ శిబిరాలకు అందజేశారు.

పేకాట శిబిరంపై దాడి

- 14 మంది జూదరులు అరెస్ట్
- రూ. 2.25 లక్షలు స్వాధీనం

ప్రజాశక్తి-గన్నవరం : పెదఅవుటపల్లి గ్రామంలో ఒక రేకుల షెడ్ లో సోమవారం అర్ధరాత్రి పేకాట ఆడుతున్న వారిని ఆత్కూరు ఎస్సై సురేష్ చావా అదుపులోకి తీసుకున్నారు. పేకాడుతున్న పద్నాలుగు మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.2,25,440 నగదును స్వాధీనం చేసుకున్నారు.. రహస్యంగా సాగుతున్న పేకాట జూదంపై డేగ కన్ను వేసేమని ఎస్సై సురేష్ తెలిపారు.

గుడ్లవల్లేరులో పోలీసుల మొహరింపు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ బాలికల హాస్టల్ బాత్రూంలో రహస్య కెమెరాల నేపథ్యంలో విద్యార్థులు, విద్యార్థి సంఘాలు నిరసన ర్యాలీ, పోలీస్ స్టేషన్ ముట్టడి చేస్తామని ప్రకటించడంతో గుడ్లవల్లేరు పోలీస్ స్టేషన్ వద్ద బారీ గేట్లు ఏర్పాటు చేసి పోలీస్ బలగాలు మంగళవారం ఉదయం మెహరించాయి. ఎలాంటి ఆందోళనలు జరగకుండా ఉండేందుకు, ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఎవరైనా విద్యార్థిని, విద్యార్థులు వస్తే వారి వివరాలు సేకరించి ఏ ఆధారాలు లేకుంటే వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. గత ఐదు రోజులుగా ఈ సంఘటనపై ప్రత్యేక బందాలు క్షుణ్ణంగా విచారణ నిర్వహిస్తున్నాయి. గుడివాడ రూరల్ సిఐ సోమేశ్వరరావు, గుడ్లవల్లేరు ఎస్సై ఎన్ వి.వి సత్యనారాయణ, ఇతర ఎస్ఐలు,స్పెషల్ ఫోర్స్ బలగాలి ఉన్నారు.

ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి : ఎస్ఐ

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాలలో గణేష్ నవరాత్రి ఉత్సవాలకు పోలీస్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని కోడూరు ఎస్సై పి శిరీష తెలిపారు. ఉత్సవాలు నిర్వహించ దలచినవారు ముందస్తుగా కమిటీని ఏర్పాటు చేసుకోవాలని,. ఆ కమిటీ వారిదే పూర్తి బాధ్యత అన్నారు. పబ్లిక్ ప్రదేశాలలో విగ్రహాలు ఏర్పాటు చేయువారు పంచాయతీ వారి అనుమతి తీసుకోవాలని, విగ్రహాలు ఏర్పాటు చేయు ప్రదేశా లలో ప్రజలకు గాని ట్రాఫిక్ కు గాని ఎటువంటి ఆటంకాలు కలుగ జేయ రాదన్నారు. డీజేలు వంటి వాటికి అనుమతి ఉండదన్నారు.

వీడని వరద ముంపు

ప్రజాశక్తి
www.prajasakti.com
కృష్ణాజిల్లా
బుధవారం
4 సెప్టెంబర్ 2024


విజయవాడ సింగ్‌నగర్‌లో నీళ్లలోనుంచి బాధితులను తీసుకెళ్తున్న దృశ్యం


విజయవాడ సింగ్‌నగర్‌లో ఇంట్లో వస్తువులను తీసుకెళ్తున్న బాధితులు


సింగ్‌నగర్‌లో వరద బాధితులకు ఆహారం అందిస్తున్న పోలీసులు


సింగ్‌నగర్‌లో వరద నీటిలో నుంచి బాధితులను తరలిస్తున్న పోలీసులు


సింగ్‌నగర్‌లో పునరావాస కేంద్రంలో వరద బాధితులు


విజయవాడ సింగ్‌నగర్‌లో పడవలపై సురక్షిత ప్రాంతాలకు వెళ్తున్న వరద బాధితులు


నేనున్నానంటూ వరద బాధితులకు భరోసా ఇస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు


సింగ్‌నగర్‌లో ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు


సింగ్‌నగర్‌లో హెలికాప్టర్ ద్వారా ఆహారం అందిస్తున్న దృశ్యం


సింగ్‌నగర్‌లో పడవల ద్వారా వరద బాధితులను తరలిస్తున్న దృశ్యం


సింగ్‌నగర్‌లో పర్యటిస్తున్న మంత్రి పార్థసారథి


ఆహారం పంపిణీ చేస్తున్న దృశ్యం



సింగ్‌నగర్‌లో బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తూ...


విజయవాడ సింగ్‌నగర్‌లో వరద ప్రాంతం నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలుతున్న బాధితులు


వరద బాధితులకు పంపిణీ చేసేందుకు హెలికాప్టర్‌లో సిద్ధం చేసిన ఆహారం, నీళ్లు


గన్నవరం మండలం అజ్జంపూడిలో వరద ముంపులోనే వరి పొలాలు


విజయవాడ సింగ్‌నగర్‌లో పర్యటిస్తున్న డిజిపి


అవనిగడ్డ మండలంలో పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద వరద ఉధృతి


విజయవాడ సింగ్‌నగర్‌లో మంచినీటి కోసం వరద నీటిలో వెళ్తున్న దృశ్యం


కంకిపాడు మండలం మంతెనలో పర్యటిస్తున్న ఎంఎల్ఎ


పామర్రులో నీట మునిగిన పంటలు పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు


గుడివాడ మండలంలో గండిని పూడ్చుతున్న దృశ్యం


పెదపారుపూడి మండలంలో పర్యటిస్తున్న ఎంఎల్ఎ వర్ల కుమార్ రాజా


తోట్లవల్లూరు మండలంలో వరద నీటిలోనే అరటి తోట


ఉంగుటూరు మండలం వెల్దిపాడులో వరద నీటిలోనే పాఠశాలలు


చల్లపల్లి మండలంలో చెరువులను తలపిస్తోన్న పంట పొలాలు


గుడివాడ మండలంలో బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న దృశ్యం


పమిడిముక్కల మండలంలో పునరావాస కేంద్రంలో ఆహారం అందిస్తున్న దృశ్యం

కోతకు గురైన కూడలి-దాములూరు రోడ్డు



ప్రజాశక్తి-నందిగామ: దాములూరు- కూడలి వెళ్లే రహదారి పూర్తిగా కొట్టకుపోయి భారీ గండ్లు పడ్డాయి. దాములూరు- కూడలి రెండు కిలోమీటర్ల రహదారిలో నాలుగు చోట్ల వరదకు భారీగా గండ్లు పడగా, మిగిలిన రోడ్డు సగానికి పైగా పూర్తిగా దెబ్బతింది. ఆ ప్రాంతంలో 10 నుండి 15 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు విద్యుత్తు పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. నందిగామ మండలం ఏటిపట్టు గ్రామాలు భారీ వర్షాలకు విద్యుత్ స్తంభాలు నేలకొరగటం, పలుచోట్ల విద్యుత్ తీగలు తెగడంతో నాలుగు రోజులుగా అంధకారంలో ప్రజలు అల్లాడుతున్నారు. నందిగామ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డిఓ ఎ.రవీంద్ర ఆధ్వర్యంలో జగ్గయ్యపేట నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులతో ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నందిగామ మండలం మాగల్లు, కొండూరు గ్రామాలలో శ్రీరాం రాజగోపాల్ పర్యటించి దెబ్బతిన్న రోడ్లను, పంట పొలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాగొల్లు, కొండూరు గ్రామ నాయకులు తోట నాగమల్లేశ్వరరావు, అప్పారావు, కృష్ణమోహన్, శేషగిరిరావు, అబ్బూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. నందిగామ మండలంలోని ఐతవరం, కంచల గ్రామాల బాధితులను మంగళవారం ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షుడు నెట్టెం రఘురాం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాటకొండ రామకోటేశ్వరరావు, వీరంకి వీరాస్వామి, వరకుమార్ పాల్గొన్నారు.

పొలాలపై ఇసుక మేట



ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: మండలంలోని రైతులకు, ప్రజలకు ఈ వరదలు భారీ నష్టాలు, కన్నీళ్లే మిగిల్చాయి. వరదలు రావడం, మున్నేరు ఉగ్రరూపం దాల్చడం, ప్రధాన కాలువలు చెరువులకు గండ్లు పడటంతో వరద ప్రవాహం రైతులు పంట పొలాలుపై గూండా ప్రవహించడంతో దాదాపు మూడు వేల ఎకరాల వరి నాట్లు వేసిన పొలాల్లో ఇసుక, ఒండ్రు మట్టి మేట వేశాయి. రెండు మూడు అడుగుల మేర ఇసుక పంట పొలాల్లో మేట వేయడంతో ఎటు వైపు చూసిన పొలాలు ఎడారులను తలపిస్తున్నాయి. కొంతమంది రైతులు పొలాలు వరద ప్రవాహానికి కొట్టుకు పోయి రూపురేఖలు లేకుండా దెబ్బ తిన్నాయి. మరికొంతమంది రైతులు పొలాలు, మామిడి తోటలతో కూడిన పొలాల్లో మామిడి చెట్లు, టేకు చెట్లు వివిధ రకాల పండ్ల చెట్లు గండ్లు పడి 20 అడుగుల మేర మట్టితో సహా చెట్లు, పొలాలు కొట్టుకుపోయాయి. పొలాల్లో లోయలు పడి వరదలకు కొట్టుకు పోవడంతో రైతులు పొలాలు సరిహద్దులు కూడా రూపు రేఖలు మారాయి. పంట పొలాలకు వేళ్ళు రహదారులు, పెనుగంచిప్రోలు నుండి వేమవరం, ముచ్చింతాల, అనిగండలపాడు, గుమ్మడి దురు, శివపురం, ముండ్ల పాడు గ్రామాలకు వెళ్ళు ప్రధాన రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని గండ్లు పూడ్చుడానికి చర్యలు తీసుకోవాలని, పంట నష్టపరిహారం అంచనాలు రూపొందించి రైతులను ఆదుకోవాలని పలువురు రైతులు, రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.

వరద బాధితులకు వైద్య సేవలు

ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వరద బాధితులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్. ఎం మధురిమ తెలిపారు. వరద కొంతమేర తగ్గుముఖం పట్టడంతో మంగళవారం నుండి రాకపోకలు ప్రారంభం కావడంతో గ్రామాల్లో సైతం వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. పిహెచ్‌సి సూపర్వైజర్ రాఘవేంద్రరావు, హెల్త్ అసిస్టెంట్లు మాతంగి శ్రీనివాసరావు, కె.విష్ణువర్ధన్‌రావు తదితరులు ఓసి క్లబ్లో వైద్య సేవలు అందించారు.

పంట పొలాలు పరిశీలన

ప్రజాశక్తి-వత్సవాయి: వర్షాలు, వరదలకు వరి, పత్తి, మిరప పంటలు దెబ్బతిన్నాయని గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బి.వెంకటేశ్వర్లు, రాజశేఖర్, లక్ష్మణ్ అన్నారు. మంగళవారం మండలంలోని చిట్యాల, మక్కపేట గ్రామాల్లో జగ్గయ్యపేట సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీ భవాని, మండల వ్యవసాయ శాఖ అధికారి వి.రవికుమార్ ఆధ్వర్యంలో పత్తి, మిర్చి, వరి పంటలను పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరి పొలంలో ఇసుక మేట వేయటం గుర్తించడం జరిగిందన్నారు. వేరు వ్యవస్థ కూడా దెబ్బతినటం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి వర్ధిని తదితరులు పాల్గొన్నారు.

తారకరామానగర్‌లో సిపిఎం సహాయక చర్యలు

ప్రజాశక్తి-విజయవాడ: వరద ముంపు ప్రాంతాలైన రాణిగారితోటలోని తారకరామానగర్, భూపేష్ గుప్తా నగర్, రామలింగేశ్వర్ నగర్, కష్ణలంక ప్రాంతాల్లో సిపిఎం ఆధ్వర్యంలో భోజనం, పాలు పంపిణీ చేశారు. 1500 మందికి భోజన ప్యాకెట్లతో పాటు పాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాధ్ మాట్లాడుతూ వరద బాధితులను పలు రూపాల్లో సిపిఎం ఆదుకుంటుందని అన్నారు. రాణిగారితోటలోని తారకరామానగర్, ఇతర ప్రాంతాలు వరద నీటిలో ఇళ్లన్నీ మునిగిపోయినా, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా నీటిని మోటార్లు పెట్టించి బయటకు పంపించే మార్గం చూపడం లేదని అన్నారు. ఇప్పటికయినా ప్రభుత్వం, అధికారులు వరద నీటిని సత్వరమే బయటకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తూర్పు సిటీ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు పి.కృష్ణ, నాయకులు టి.చంద్రశేఖర్, డి వరప్రసాద్, కె వెంకటేశ్వరరావు, కోటిరెడ్డి, రమాదేవి, సుమతి, వై దుర్గా, కె ఆదాం తదితరులు పాల్గొన్నారు. కృష్ణలంక 21వ డివిజన్ కోదండరామా ఘాట్ వద్ద (పాతపోలీస్టేషన్ రోడ్డు) వరద రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా సిపిఎం ఆధ్వర్యంలో రెండు వేల ఇసుక బస్తాలను అడ్డుకట్ట వేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాధ్ పర్యవేక్షణలో స్థానిక రణదివెనగర్ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



సహాయక చర్యల్లో యువ నేతలు



ఆహారం పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

వరద బాధితులకు అండగా యువ నేతలు

సిపిఎంకు చెందిన యువ నేతలు వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు చేర వేస్తూ పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సిపిఎం రాష్ట్ర నాయకులు జి రామన్న, వై రాముతో పాటు జిల్లా నాయకులు పి.కృష్ణ, నాగేశ్వరరావు, ఎన్ కృష్ణ, ఆర్ రాజశేఖర్ తదితరులు సింగ్‌నగర్‌లోని కండ్రిక, రాజీవ్‌నగర్ ప్రాంతాల లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వృద్దులు, చిన్నారులు, మహిళలను బయటకు తరలించారు. నాలుగు బోట్లు, రబ్బరు టూబ్‌ల ద్వారా మంగళవారం సాయంత్రం 3.30 నుంచి 7.30 గంటల వరకు వారు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

వరద సహాయక చర్యల్లో శ్రమిస్తున్న సిపిఎం శ్రేణులు

ప్రజాశక్తి-విజయవాడ : విజయవాడలో వరద బాధితులను ఆదుకోవటానికి సిపిఎం కార్యకర్తలు, నాయకులు అహర్నిశలు శ్రమిస్తున్నారు. సెప్టెంబరు 1వ తేదీ రాత్రి 1000 మందికి ఆహారం ఏర్పాట్లు చేశారు. అలాగే వేలాదిమందికి కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు పంపిణీ చేశారు. సోమవారం దాత అప్పలరాజు సహకారంతో 2 వేల మందికి పెరుగన్నం పంపిణీ చేశారు.రాత్రి 4 వేల మందికి ఆంధ్ర మోటార్ మర్చంట్ అసోసియేషన్ సహకారంతో బిర్యానీ, దాతల సహకారంతో వెయ్యి మందికి రొట్టెలు పంపిణీ చేశారు. అర్ధరాత్రి రెండు గంటల వరకు వివిధ ప్రాంతాలకు పడవల ద్వారా ఆహారం, నీరు అందించారు. బయటకు తీసుకు రావాల్సిన వారిని, లోపలికి పంపాల్సిన వారిని అధికారులతో మాట్లాడి పడవల్లో పంపే ఏర్పాటు చేశారు. అజిత్ సింగ్‌నగర్ స్మైల్ హాస్పిటల్‌లో ప్రసవించిన ఆరుగురు మహిళలను,, తల్లి పిల్లలతో కాలి నడకన వస్తున్న వారిని అంబులెన్స్ ఏర్పాటు చేసి సురక్షిత ప్రాంతాల్లో ఆసుపత్రులకు తరలించారు. సిపిఎం కార్యకర్తలు కాలినడకన నాలుగు అడుగుల నీటిలో రాజీవ్‌నగర్, ఉడా కాలనీ తదితర ప్రాంతాలకు వెళ్లి సహాయం అందించారు. పడమట లంక సిపిఎం కార్యాలయంలో కష్ణానది వరద బాధితులకు పునరావాస శిబిరం ఏర్పాటు, ఆహారం పంపిణీ చేశారు.



భ్రమరాంబపురం, కష్ణలంక మెట్లబజార్ తదితర ప్రాంతాల్లో కష్ణా కరకట్టకు గండిపడకుండా ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేశారు. రామలింగేశ్వర నగర్, తారక రామానగర్ తదితర ప్రాంతాల్లో ఆహారం పంపిణీ చేశారు. మొగల్రాజపురంలో కొండచరియలు విరిగిపడి ఆరుగురు మతి చెందగా బాధితులకు అండగా నిలిచారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో బాధితులకు పునరావాసం కల్పించారు. పాతబస్తీ కొండ ప్రాంతాల్లో గోడలు పడిపోయి నష్టపోయిన బాధితులకు అండగా నిలిచారు. వరద సహాయ కార్యక్రమాల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, బోయి సత్యబాబు, కళ్యాణ్, ఎన్.సిహెచ్. శ్రీనివాస్, నాయకులు పి.కృష్ణ, కె.దుర్గారావు, యువజన, విద్యార్థి నేతలు రామన్న, రాము, ప్రసన్న, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గంపలగూడెం: కూలీకి వెళ్లి చెట్టు నరుకుతూ విద్యుత్తు షాక్‌కు గురై యువకుడు మృతిచెందిన సంఘటన మంగళవారం జరిగింది. మండలంలోని నెమలి దళితవాడకు చెందిన కుంభగిరి కృష్ణ (35) అదే గ్రామానికి చెందిన పామర్తి కృష్ణకుమారి ఇంటి ముందు ఉన్న టేకు చెట్టు కొమ్మలు నరికేందుకు కూలీకి వెళ్లాడు. ఆ సమయంలో పైన వున్న 11/కె వి వైర్లు తగలడంతో ఒక్కసారిగా సిసి రోడ్డుపై పడడంతో తలకు తీవ్రమైన గాయమైంది. వెంటనే బాధితుడిని వైరా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని తండ్రి పెద్ద పెంటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌బిఐ ఆపన్నహస్తం

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు భగత్ సింగ్‌కాలనీలో వరద ముంపుకు గురైన పేదలకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తిరువూరు బ్రాంచ్ ఉద్యోగులు మంగళవారం ఆపన్నహస్తం అందజేశారు. 22 కుటుంబాలకు దుప్పట్లు, 25 కిలో బియ్యం బాగ్స్ పంపిణీ చేశారు. ప్రకృతి విలయంతో సర్వం కోల్పోయిన ఎంతో మంది పేదలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదుకోవటానికి మిందుఇచ్చినట్లు బ్రాంచ్ చీఫ్ మేనేజర్ రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ గోపీనాథ్, క్యాష్ ఆఫీసర్ ప్రసాద్, క్యాషియర్ ఆదిత్య, సిబ్బంది, ఉయ్యూరు జయప్రకాష్, ఎంద్రాతి రంజిత్, బెల్లంకొండ సుధీర్, పెరుమాళ్ళ మనోజ్, ఇనపనూరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నష్టం అంచనాలు సిద్ధం చేయాలి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జగ్గయ్యపేట నియోజకవర్గంలో భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన ఇల్లు, పంట పొలాలు, మినీ బ్రిడ్జిలు, కల్వర్టులు, రోడ్లకు సంబంధించి నష్టాన్ని వెంటనే సంబంధిత అంచనాల సిద్ధం చేయాలని జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం బూదవాడ గ్రామంలో వరదల కారణంగా నష్టపోయిన ఇళ్లను, రోడ్లను, బ్రిడ్జి రోడ్డును పరిశీలించారు. గ్రామంలో వరదలతో దెబ్బతిన్న వరద బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి ఆయా ప్రాంతాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తాతయ్య గారు మాట్లాడుతూ అర్ అండ్ బి, ఇరిగేషన్, హౌసింగ్, వ్యవసాయ, విద్యుత్ తదితర శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో వెంటనే అంచనాలు తయారు చేయాలని వాటికి కావాల్సిన నిధులు ప్రభుత్వపరంగా తీసుకురావడం జరుగుతుందన్నారు. వరద బాధితులకు అండగా ప్రభుత్వం నిలుస్తుందని అన్నారు.

క్రమంగా తగ్గుతున్న వరద

• ఇళ్లకు చేరుతున్న బాధితులు • పశుగ్రాసం లేక అలమటిస్తున్న పశువులు



ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఫెర్రీలో వరద నీరు మంగళవారం రాత్రికి క్రమంగా తగ్గుతూ వస్తుంది. ఇబ్రహీంపట్నంలో చిన్న లంక ప్రాంత వాసులను ట్రక్ టెర్మినల్ వద్ద పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. అలాగే జూపూడి, మూలపాడు, కోటికలపూడి, దాములూరు, చిలుకూరు గ్రామాల్లో పునరవాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎక్కువ శాతం ప్రజలు పునరావాస కేంద్రాల్లో కాకుండా ఇళ్లలోనే ఉండిపోయారు. గుంటూరు జిల్లా పెద లంక గ్రామాలకు చెందిన ప్రజలను సైతం హెలికాప్టర్ ద్వారా ట్రక్ టర్మినల్‌కు తరలించారు. వరద తీవ్రత తగ్గడంతో ప్రజలు వారి ఇళ్లకు చేరుకొని శుభ్రం చేసుకునే కార్యక్రమం ప్రారంభించారు. పశువులకు రెండు రోజుల నుంచి పశు గ్రాసం, నీళ్లు లేక అల్లాడుతున్నాయి. దాములూరు, చిలుకూరు, కోటికలపూడి, జూపూడి, మూలపాడు తదితర గ్రామాల్లో వరిగడ్డి వాములు కొట్టుకుపోవడంతో, పశు గ్రాసం నీట మునగడంతో పశువులకు గ్రాసం కరువైంది. వరద తగ్గినప్పటికీ ఇబ్రహీంపట్నం ఫెర్రీలలో కరెంటు ఇవ్వకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వరద ఉధతికి కొట్టుకు వచ్చిన పాములు, ఇతర జలచరాలు ఇళ్లలోకి చేరాయని, రాత్రి సమయంలో బిక్కుబిక్కుమంటూ నివాసాలలో కాలం గడపాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాధితులను పరామర్శించిన సిపిఎం

ఇబ్రహీంపట్నం ట్రాక్ టెర్మినల్ ఉన్న పెద్దలంక చిన్న లంక పెర్రి గ్రామ వరద బాధితులను ప్రజలను సిపిఎం మండల కార్యదర్శి యం మహేష్ పరామర్శించారు. కొటికలపూడి గ్రామంలో రైతులు, కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్ర వర్షం, వరదలు వల్ల నష్టపోయిన పంట పొలాలకు తక్షణమే నష్టపరిహారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని, రైతులను ఆదుకోవాలని మండలం మొత్తం పంట పొలాలు నీట మునిగి ఇళ్లల్లోకి నీరు చేరి ప్రజలు, రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు.

కొనసాగుతున్న ఆహారం పంపిణీ

వరద బాధితులకు ఆహార పొట్లాలు, పాలు, మంచినీరు స్వయంగా మైలవరం శాసనసభ్యుల వసంత కృష్ణప్రసాద్ స్వయంగా పంపిణీ చేస్తున్నారు. అలాగే ఇబ్రహీంపట్నంలో వరద బాధితులకు కొండపల్లి హజరత్ సయ్యద్ షాబుఖారి బాబా దర్గా నిత్య అన్నదాత అల్తాఫ్ బాబా అండగా నిలిచారు. స్థానిక గాజుల పేట, ఫెర్రీ డౌన్, ఇసుక రేవు ప్రాంతాల్లో 3 వేల మంది వరద బాధితులకు మంగళవారం అన్నదానం చేశారు. స్వీట్, కట్టా, చికెన్ కర్రీతో పలావ్ వడ్డించారు. వరద బాధితులకు ఇప్పటి వరకు 15 వేల మందికి ఆహారం అందించినట్లు తెలిపారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కూడా బాధితులకు భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో అల్తాఫ్ బాబా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితులకు డ్రోన్లతో సాయం : ఎంపి



ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: వరద ముంపు ప్రాంతాల్లో బోట్స్,ఇతర మార్గాల ద్వారా సాయం అందించేందుకు వీల్లేని ప్రాంతాల్లో చిక్కుకున్న బాధితులకి డ్రోన్స్ ద్వారా సాయం అందిస్తున్నట్లు విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో కలిసి డ్రోన్ల ద్వారా ఫుడ్ అండ్ మెడికల్ కిట్ డెలివరీ విధానాన్ని ఎంపి కేశినేని శివనాథ్, మంత్రి సవిత, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. కేంద్ర మంత్రికి సింగ్ నగర్, జక్కంపూడిలోని వరద పరిస్థితి వివరించారు. అనంతరం ఎంపి మాట్లాడుతూ వరద ముంపులో చిక్కుకున్న ప్రతి ఒక్కరికి సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం టెక్నాలజీని కూడా వినియోగించుకుంటుందన్నారు. మనుషులు వెళ్లలేని ప్రాంతాలు బోట్స్ ద్వారా, బోట్స్ వెళ్లలేని ప్రదేశాలకు, హెలికాప్టర్స్ ద్వారా ఆహారం, నీళ్లు అందించే ఏర్పాట్లు చేశామన్నారు. హెలికాప్టర్ ద్వారా కూడా సాధ్యం కానీ ప్రదేశాలకు డ్రోన్స్ ద్వారా ఆహారంతో పాటు వారికి అవసరమైన మెడికల్ కిట్స్ పంపిణీ చేస్తామని తెలిపారు.

ఉద్యాన తోటల్లో వర్షం నీరు తొలగించాలి

ప్రజాశక్తి-ఎ.కొండూరు: ఉద్యానవన పంటలను సాగు చేస్తున్న రైతులు వరద నీటినితొలగించాలని ఉద్యాన శాఖ అధికారి బి.నరేంద్రకుమార్ రైతులకు సూచించారు. మంగళవారం మాధవరం, రామచంద్రాపురం, చీమలపాడు గ్రామాల్లో బొప్పాయి, మిరప, వంగ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ పంటలకు తెగుళ్లు సోకకుండా చేయాల్సిన చర్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ రామచంద్రరావు, ఉద్యాన శాఖ సహాయ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, నాగరాజు, బెజవాడ శంకర్ పాల్గొన్నారు.



పంటలు పరిశీలన

ప్రజాశక్తి-తిరువూరు: పంట దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు సాంబారు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. తిరువూరు రాజుపేట రెవెన్యూలో తంబలోరు కుంట కింద వరద ముంపుకు గురైన వరి పంటను మంగళవారం ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. పొట్ట దశలో ఉన్న వరి వరదకు కొట్టుకుపోయిందని చెప్పారు. రైతులు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నారని, తక్షణ సహాయం కింద ఎకరాకు రూ.20 వేలు చొప్పున ప్రభుత్వం రైతులకు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి వేముల హరికృష్ణ, రైతులు బండి వెంకటేశ్వరరావు, గోదా వెంకటేశ్వరరావు, పామర్తి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జిపై మట్టి తొలగింపు

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: స్థానిక మునేరుకు భారీ వరద వచ్చి బ్రిడ్జి పైనుంచి నీరు ప్రవహించి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. సోమవారం సాయంత్రం నుంచి బ్రిడ్జిపై రాకపోకలు కొనసాగుతున్న క్రమంలో బ్రిడ్జిపై పేరుకపోయిన మట్టి కారణంగా ద్విచక్ర వాహనదారులు చాలా తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని, కొన్ని ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయని దీనిని శుభ్రం చేయించాలి అని గ్రామస్తులు టిడిపి నాయకులు చింతల వెంకట సీతారామయ్య దష్టికి తీసుకువెళ్లగా వెంటనే వారి ఆదేశానుసారం మాదినేని విక్రమ్ వారి సొంత ట్రాక్టర్ ట్యాంకరు మరియు డోజర్ తోటి దానిని శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో పెనుగంచిప్రోలు ఎస్ఐ అర్జున్, మాదినేని విక్రం, మాదాల శ్రీనివాసరావు, లగడపాటి



ప్రవీణ్, చల్లా నరేష్ పాల్గొన్నారు. వరద ముంపు బాధితులకు స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం, టిడిపి మండల అధ్యక్షుడు చింతల వెంకట సీతారామయ్య, సర్పంచ్ వేల్పుల పద్మ కూమారి ల ఆధ్వర్యంలో అల్పాహారం, భోజనాలు, తాగునీరు అందిస్తున్నారు. ఇప్పటికే వరద ప్రవాహం తగ్గిన ప్రాంతాల్లో అధికారులు సహాయక చర్యలు చేపట్టారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ప్రజలకు ఎప్పుడు ఏ కష్టం వచ్చినా అండగా ఉండటానికి తాము సిద్ధంగా ఉన్నామని కాలుష్య నియంత్రణ పోరాట సమితి సభ్యులు మరోసారి రుజువు చేశారు. బాధితులకు కాలుష్య నివారణ పోరాట సమితి ఆధ్వర్యంలో మంగళవారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు చెరుకుమల్లి సురేష్, బోలియశెట్టి శ్రీకాంత్, అవులూరి వెంకటరెడ్డి, కరిముల్లా, ఎంఎ హైదర్, రాజేంద్ర, మాధురి, భవాని తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మైలవరం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు స్థానికంగా ఉన్న కుందుర్తి హైమావతి తన ఇంటిని కోల్పోయి దాతల సహాయం కోసం ఆశగా ఎదురుచూస్తుంది. ఈ నేపథ్యంలో ఎస్ఎస్ బ్యాట్మెంటన్ అధినేత, లైన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం కార్యదర్శి లయన్ చలమోలు నాగభూషణం స్పందించి ఆమెకు ఒక నెలకు సరిపడా నిత్యవసర వస్తువులతో పాటు రూ.5 వేల నగదు, నూతన వస్త్రాలను మంగళవారం అందించారు. ఈ కార్యక్రమంలో లయన్ జాస్తి వెంకటేశ్వరరావు, లయన్ కోడూరు మనోజ్ కుమార్, ఎస్.ఎస్ బ్యాడ్మింటన్ సభ్యులు కొండా, అవ్వరు శ్రీను, అమర్నాథ్, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రెడ్డిగూడెం మండల పరిధిలోని నాగులూరు వద్ద విజయవాడ-విస్సన్నపేట ఆర్అండ్‌బి రహదారి తెగిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రెడ్డిగూడెం తహశీల్దారు సుశీలదేవి, టిడిపి నాయకులు విజయబాబు, ముప్పిడి నాగేశ్వరరెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు మంగళవారం రోడ్డును పరిశీలించారు.

కొనసాగుతున్న లయన్స్ సేవలు

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు భగత్ సింగ్ కాలనీలో లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు రెండవ రోజు మంగళవారం కూడా కొనసాగాయి. నీట మునిగిన వారి ఇంటింటికి వెళ్లి దుస్తులు పంపిణీ చేస్తున్నారు. మొదటి రోజు భోజన సదుపాయం కల్పించామని లయన్స్ క్లబ్ అధినేతలు పసుమర్తి వెంకటే శ్వరరావు, కొమ్మినేని రాజేష్ ఖన్నా తెలిపారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: మండల కేంద్రంలోని వికాస్ కాలేజీలో ఆశ్రయం పొందుతున్న వారికి ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్‌సిఐ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కె.వెంకటేశ్వరరావు, ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థల అధ్యక్షుడు చాట్ల విజయకుమార్, జె.వెంకటేశ్వరరావు, పాలెపు ప్రసాద్, ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ గౌరవ సలహాదారుడు పత్తిపాటి పాల్ఇమ్మానుయేలు, కార్యదర్శి సిహెచ్ హన్న పాల్గొన్నారు.

పైపులరోడ్డులో గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడలోని సింగ్‌నగర్ పైపుల్ రోడ్డు పక్క సందులో ఏ వన్ టీ స్టాల్ వద్ద గుర్తుతెలియని మృతదేహం పడి ఉంది. మూడు రోజులుగా మృతదేహం నుండి దుర్వాసన రావడంతో స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మృతుడి వయసు సుమారు 50 సంవత్సరాలు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. అనారోగ్య కారణాల వల్ల మృతిచెంది ఉండొచ్చని, అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని స్థానికికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మట్టి ఖర్చులకు సాయం

ప్రజాశక్తి-భవానీపురం: చిట్టినగర్ కెఎల్‌రావు ప్రాంతానికి చెందిన బాలినేని కృష్ణ, గాయత్రీల కుమార్తె సాయి సుగుణ మంగళవారం మృతిచెందింది. నిరుపేదలైన కుటుంబానికి ఎమ్మెల్యే సుజనాచౌదరి ఆదేశాలతో కార్యాలయ సిబ్బంది మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం అందించారు. కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు.

ఎల్ఐసి బీమా వారోత్సవాలు

ప్రజాశక్తి-తిరువూరు: ఎల్ఐసి 68వ వార్షికోత్సవం సందర్భంగా తిరువూరు శాటిలైట్ కార్యాలయంలో బీమా వారోత్స వాలు నిర్వహిస్తున్నట్లు బ్రాంచ్ మేనేజర్ ఎం.రమేష్ తెలి పారు. మంగళవారం బ్రాంచ్ కార్యాలయంలో జ్యోతి ప్రజ్వలన, కేక్ కట్ చేసి వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ఆప దలో ఉన్న వారు అర్ధకంగా నష్టపోకుండా ఆ కుటుంబా న్ని ఆర్థికంగా ఆదుకునేది ఒక ఎల్ఐసి సంస్థ మాత్రమే నని పేర్కొన్నారు. ఎల్ఐసి వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 6 వరకు ఎల్ఐసి ఏజెంట్లు, పాలసీదారులకు వివిధ పోటీలు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మేనేజర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ లు వెంకటేశ్వరరావు, పరీద్, పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

ప్రజాశక్తి-తిరువూరు: జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారుల ఆదేశాల మేరకు తుపాన్ కారణంగా మూగ జీవులకు ఆరోగ్య పరిస్థితిపై తిరువూరు మండలం, మల్లేల గ్రామీణ పశువైద్య శాల లో పశువులకు, గొర్రె లకు, మేకలకు వైద్య సహాయం అందించినట్లు పశు వైద్యురాలు టి.శ్వేత మంగళవారం తెలిపారు. రెండు ఆవులు, 11 గేదెలు, 20 గొర్రెలు, 23 మేకలకు వైద్య పరీక్షలు చేసినట్లు చెప్పారు. అధిక వర్షాల కారణంగా దోమలు, ఈగలు పశువులపై ఎక్కువగా దాడి చేస్తుంటాయని, దోమతెరలు వాడాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మల్లెల పశువైద్యశాల విఎల్ఓ ఎం.గోపాలకృష్ణ, రైతు సేవా కేంద్రం ఏహెచ్ఏలు నాగేంద్రబాబు, జయసాగర్, విజేయ్, సందీప్, జీవా మిత్ర నరేష్ పాల్గొన్నారు.

భోజన ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి-మైలవరం: ఇటీవల కురిసిన వర్షాలకు నిరాశ్రయులైన వారికి ద్వారకాతిరుమల దేవస్థానం చైర్మన్ ఎస్‌పి సుధాకర్‌రావు, వంశపరంపర్య ధర్మకర్త లయన్ ఎస్‌విఎన్ నివృత్తరావుల ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా చేస్తున్న భోజన ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం కూడా కొనసాగింది. షాదీఖానా, తిరువూరు రోడ్‌లోని పెట్రోల్ బంక్ సమీపంలో, బాలయోగి నగర్ ప్రాంతాల్లో వరద ముంపుకు గురైన బాధితులు 600 మందికి భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్ చారుగాండ్ల ప్రసాద్, కోడూరు మనోజ్ కుమార్, చలవాది హరీష్ కుమార్ గుప్తా, నాగభూషణం, కొల్లి ప్రసాద్, టి వెంకటేశ్వరరావు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు సింగిల్ విండోలో అనుమతులు

ప్రజాశక్తి-ఎ.కొండూరు, తిరువూరు: వినాయక చవితి ఉత్సవాలకు సింగిల్ విండో ద్వారా అనుమతులు ఇవ్వనున్నట్లు ఎ.కొండూరు ఎస్సై చల్లా కృష్ణ, తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మీసేవ కేంద్రాల ద్వారా రుసుము చెల్లించి వినాయక మండపాల అనుమతులు తీసుకోవాలని సూచించారు. 7995095800 ఫోన్ నెంబర్‌కు వాట్సప్ ద్వారా హాయ్ అని సందేశాన్ని పంపిస్తే సరిపోతుందన్నారు. ఎన్ ఓ సి కోసం అనుసరించాల్సిన ప్రక్రియ మొత్తం వాట్సాప్ యాప్ ద్వారా వారి మొబైల్ ఫోన్ కి వస్తుందని చెప్పారు. దరఖాస్తు చేసే సమయంలో కమిటీ సభ్యులు మండపం ఏర్పాటు చేసే ప్రదేశం తదితర వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందని వారు సూచించారు.

ముంపు ప్రాంతాల్లో మంత్రుల పర్యటన

ప్రజాశక్తి-వన్‌టౌన్: పశ్చిమలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో మంగళవారం మంత్రులు అచ్చెన్నాయుడు, పత్తిపాటి పుల్లారావులు ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి)తో కలిసి పర్యటించారు. చిట్టినగర్, కేఎల్ రావు నగర్, సితార, ప్రాంతాలలో ట్రాక్టర్లలో వెళ్లి వరద ప్రాంతాలను పరిశీలించారు. బాధితులకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. అందరికీ ఆహారం అందేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ తానా ప్రతినిధి కోమటి జయరాం, నాగుల్‌మీరా కూటమి నాయకులు పాల్గొన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది, కూటమి నాయకులు, సహాయక కార్యక్రమాలను వేగవంతం చేశారు. వరద బాధిత ప్రాంతాల్లో నాలుగో రోజు కూడా ఆహారాన్ని అందిస్తున్నారు. చిట్టినగర్‌లోని కామాక్షి విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపంలో గత నాలుగు రోజులుగా అనేక వేల మందికి భోజనాలను ఏర్పాటు చేస్తున్నారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు సుజనాచౌదరి కార్యాలయం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని కార్యాలయ కార్యదర్శి పత్తిపాటి శ్రీధర్ హామీ ఇచ్చారు.



వరద ప్రాంతాల్లో వెల్లంపల్లి పర్యటన

విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో వరద ముంపుకు గురైన ఊర్మిళా నగర్, ఏకలవ్య నగర్, రెడ్డి కాలనీ, జోజి నగర్ ప్రాంతాలలో మంగళవారం మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు పర్యటించారు. వరద ముంపుకు గురైన ప్రాంతంలోని ప్రజలను పరామర్శిస్తూ వారి యోగ క్షేమాలను తెలుసుకున్నారు.

వాటర్ బాటిళ్లు పంపిణీ

వరద బాధిత కుటుంబాలకు వైసిపి నాయకులు పోతిన మహేష్ మంగళవారం వాటర్ బాటిల్స్, 500 వెజ్ బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఎస్‌టి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మద్దిల రామకృష్ణ సూచనల మేరకు వెయ్యి వాటర్ బాటిల్స్, 500 వెజ్ బిర్యానీ బాక్సులను ఏకలవ్య నగర్ ముంపు బాధితుల కోసం అందజేశారు.



సహాయ కార్యక్రమాల్లో కెబిఎన్

వరద బాధిత కుటుంబాలకు సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని ఎస్‌కేపీవీవీ హిందూహైస్కూల్స్ కమిటీ అధ్యక్షులు తొమ్మండ్రు శేషయ్య అన్నారు. కేబీఎన్ కళాశాల ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో అల్లాడుతున్న వరద బాధిత కుటుంబాలకు ఆహార పొట్లాల పంపిణీ కార్యక్రమాన్ని మూడు రోజులుగా నిర్వహిస్తుంది. రెడ్‌క్రాస్‌సోసైటీ, ఎన్ఎస్ఎస్‌తో పాటుగా వివిధ విభాగాల సమన్వయంతో ఆయా ప్రాంతాల్లో పంపిణీని కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం వాహనాన్ని శేషయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు, గోళ్ల బాబావిజయకుమార్, రాఘవయ్య, జే శ్రీనివాస్, హిందూహైస్కూల్స్ కమిటీ ఏవో డాక్టర్ వీ నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ ఎం వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

కలెక్టర్‌కు సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ విజ్ఞప్తి

ప్రజాశక్తి-విజయవాడ: వరదల వల్ల పెద్ద సంఖ్యలో ప్రజలు నిరాశ్రయులయ్యారని, వందలాది మంది తమను ఆదుకోవాలని భవనాల పైనుండి ఆర్తనాదాలు చేస్తున్నారని, వారికి తాగునీరు, ఆహారం, పిల్లలకు పాలు, మందులు అందించి ఆదుకోవాలని సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ కోరారు. సింగ్‌నగర్ ప్రాంతంలో మంగళవారం సిపిఎం బృందం పర్యటించిన నేపథ్యంలో గమనించిన విషయాలను ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజనకు ఆయన లేఖ ద్వారా తెలిపారు. ప్రజలు తాము ఎక్కడకు వెళ్లాలో, ఎలా వెళ్లాలో, ఎవరికి చెప్పుకోవాలో తెలియని స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. రోజుల పసికందుతో ఒక బాలింత తన తల్లి సహాయంతో గొంతు వరకు ఉన్న నీటిలో నడుచుకుంటూ ఫ్లైఓవర్ ఫుట్ పాత్ మీద కుర్చుని ఉన్న హృదయ విదారక ఘటన చూసి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తోడ్పడినట్లు తెలిపారు. ప్రభుత్వం తయారు చేసిన ఆహారం ప్రజల వద్దకు వెళ్లినట్లు లేదని, బాధితులు ఆహారం, తాగునీరు కోసం అల్లాడుతున్నారని పేర్కొన్నారు. హెలీకాప్టర్లు, డ్రోన్లు, బోట్ల ద్వారా ప్రజావసరాలను తక్షణమే అందించాలని, వైద్యుల బృందాలను, మందులను వారి ఇళ్ల వద్దకే పంపాలని కోరారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు యంత్రాంగాన్ని సమర్థవంతంగా పని చేయించాలని, ప్రజాసంఘాలకు బోట్లు అందచేస్తే వారు కూడా ఆహారం, తాగునీరు, పాలు, మందులు తదితర రూపాల్లో ప్రజల తక్షణ అవసరాలు తీర్చడానికి వీలవుతుందని తెలిపారు.

పాపులర్ షూ మార్టు విరాళం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: వరద బాధితులకు మంచినీరు, ఆహారం అందించడానికి అక్షయపాత్ర ఫౌండేషన్‌కు పాపులర్ షూ మార్టు సంస్థ రూ.1.50 లక్షలు విరాళం అందించినట్లు మేనేజింగ్ పార్టనర్ చుక్కపల్లి విజయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.



బుడమేరు, కృష్ణా నదులకు ఆకస్మికంగా వచ్చిన వరదల కారణంగా నగర పరిసర ప్రాంతాలలో ముంపుకు గురైన బాధితులకు సహాయార్థం అందించినట్లు తెలిపారు. పాపులర్ షు మార్టు తరపున ఐదు వేల మందికి ఆహారం అక్షయ పాత్ర పౌండేషన్ తరపున అందించేందుకు నగదును అందించినట్లు తెలిపారు. విరాళం అందించిన వారిలో పాపులర్ షు మార్టు ప్రతినిధులు చుక్కపల్లి సందీప్, చుక్కపల్లి అవినాష్, చుక్కపల్లి అభిలాష్‌లు అక్షయపాత్ర ప్రతినిధులకు అందచేశారు.

రమేష్ హాస్పిటల్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ: రమేష్ హాస్పిటల్స్,వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.5 లక్షల విరాళాన్ని రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్



పోతినేని రమేష్‌బాబు, హాస్పిటల్స్ ప్రతినిధులు డాక్టర్ రాయపాటి మమత, డాక్టర్. వై.కార్తీక్ చౌదరి రాష్ట్ర మంత్రి లోకేష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహననాయుడు, రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు హాస్పిటల్ యాజమాన్యాన్ని అభినందించారు.

లింగాల బ్రిడ్జిపై నిలిచిన రాకపోకలు

ప్రజాశక్తి-వత్సవాయి: గత నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు లింగాలు బ్రిడ్జిపై చిట్యాల వైపు బ్రిడ్జి స్లాబులు లేచిపోయి 20 అడుగుల వరకు గండి పడింది. దీనికి తోడు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ఉధృతికి లింగాల బ్రిడ్జిపై రాకపోకలు నిలిచిపోయాయి. లింగాల మున్నేరును స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య పరిశీలించారు. లింగాల బ్రిడ్జి వద్ద పడిన గండిని పరిశీలించి అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరలో ఆ గండిని పూడ్చటానికి చర్యలు తీసుకోవాలన్నారు.

హెలికాప్టర్ ద్వారా ఆహారం పంపిణీ : కమిషనర్


ప్రజాశక్తి-విజయవాడ

వరద ప్రభావిత ప్రాంతంలో ప్రజలకు ఆహారం చేసేటట్టు చూసుకోవాలని బోట్ల సహాయంతోనే కాకుండా హెలికాప్టర్ల ద్వారా వరద బాధితులకు కూడా ఆహారం పంపించాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. మంగళవారం ఉదయం థ్రెడై విజయవాడ వారు తయారు చేసిన ఆహార పొట్లాలు, మంచినీరు పంపిణీకు హెలికాప్టర్ ద్వారా కూడా భోజనం పంపిణీ చేస్తున్న ప్రక్రియను ఇతర అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ ధ్యానచంద్ర వార్డ్ సెక్రటరీలు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఆహారం పంపిడి అందరికీ చేరేలా చూసుకోవాలని, కంట్రోల్ రూమ్ నుండి వచ్చిన ఫిర్యాదులకు వెంటనే చర్యలు తీసుకొని ప్రతి ఒక్కరికి సహాయం అందేటట్టు చూసుకోవాలని ఆదేశించారు. దీనిలో భాగంగా 58వ డివిజన్లో గల తోట వారి వీధి, ఇంద్ర నాయక్ నగర్, నందమూరి నగర్, అజిత్ సింగ్ నగర్ లోని వడ్డెర కాలనీ, కె.ఎల్ రావు నగర్ రోడ్, పి ఎన్ టి కాలనీ, బసవపున్నయ్య ఇండోర్ స్టేడియం ప్రాంతం, 59వ డివిజన్లో గల ఏఎస్ఎన్ అపార్ట్మెంట్ ప్రాంతం, అజిత్ సింగ్ నగర్, గంగానమ్మ గుడి, ఎంకే బైగ్, లూనా సెంటర్ ప్రాంతం, 60 డివిజన్ లోగల ఏబిసిడిఈఎఫ్‌జి బ్లాక్ బాంబే కాలనీ, 61 డివిజన్లో గల శాంతినగర్, ప్రశాంతి నగర్, సరదా స్కూల్ ప్రాంతం, హెచ్ బ్లాక్ వాంబే కాలనీ, 62 డివిజన్లో గల న్యూ పైకాపురం, ఫైర్ స్టేషన్ ఏరియా, ప్రకాష్ నగర్, ఎల్ బి ఎస్ నగర్, 63వ డివిజన్లో గల ఎంఐజి వుడా కాలనీ, న్యూ రాజీవ్ నగర్, రాధా నగర్, సుందరయ్య నగర్, ఓల్డ్ రాజీవ్ నగర్,



ఉడా కాలనీ, 64వ డివిజన్లో గల కుండ వారి కండ్రిక, ఎన్ఎస్‌సి బోస్ నగర్, బివి సుబ్బారెడ్డి స్కూల్ ప్రాంతం, ప్రజాశక్తి నగర్, విద్యాసాగర్ ఎన్జీవో కాలనీ లలో నివసిస్తున్న ప్రజలకు హెలికాప్టర్ ద్వారా ఆహారం అందేటట్టు చూసుకోవాలని, మరోవైపు బోట్ల సహాయంతో ఆహార పంపిణీ కూడా చేస్తూ ప్రజలందరికీ ఆహారం విషయంలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని అందుకు వార్డు సెక్రటరీలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు.

ముంపు ప్రాంతాల్లో ప్రజాప్రతినిధుల పర్యటన



వరద ముంపు ప్రాంతాల్లో నందిగామ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు పర్యటించారు. పెండ్యాల, వేములపల్లి గ్రామాల్లో వరదల వలన నీట మునిగిన పంట పొలాలు, నివాశాలను పరిశీలించారు. ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే ఆహారం, తాగునీరు అందించాలని అధికారులకు విజప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మార్త శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: వరద ఉధృతికి మండలంలోని కె అగ్రహారం పాలేటి బ్రిడ్జి ధ్వంసమైంది. మంగళవారం శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య బ్రిడ్జిని పరిశీలించారు. కెసిపి సిమెంట్ యాజమాన్యం వారు వరద తాకిడికి గురైన బ్రిడ్జిని యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. అనంతరం అగ్రహారం గ్రామంలో పర్యటించి వరద ఉధృతికి దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి ప్రజలను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. పట్టణంలోని స్థానిక మఠం శివాలయం పరిసర ప్రాంతాలలో వరద ముంపు ప్రాంతాలను మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ గొట్టే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు భరోసా...

ప్రజాశక్తి-కంచికచర్ల: వరదకు నష్టపోయిన ప్రతి కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని విజయవాడ పార్లమెంటరీ టిడిపి అధ్యక్షులు మాజీ మంత్రి నెట్టెం రఘురాం పేర్కొన్నారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో కృష్టానది ముంపు బారిన పడి స్థానిక ఓసి క్లబ్బులో పునరావాస కేంద్రంలో ఉన్న బాధితులను మంగళవారం ఆయన పరామర్శించారు దాతల సహకారంతో టిడిపి నాయకులు చేస్తున్న సహాయాన్ని అడిగి తెలుసుకున్నారు.. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కోగంటి బాబు, తాసిల్దార్ జాహ్నవి, గుత్త రత్నం, తాడపనేని లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు దుప్పట్లు, చీరలు పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: విజయవాడకు డాక్టర్ చింత రంగధామారావు చారిటబుల్ ట్రస్ట్, సెల్ హెల్త్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ చింతా రవికుమార్ ఆధ్వర్యంలో బూదవాడ గ్రామంలోని వరద బాధితులకు 200 చీరలు, దుప్పట్లు జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య ఆధ్వర్యంలో అందజేశారు. అనంతరం ట్రస్ట్ ప్రతినిధి కొల్లి అజయ్ రమాకాంత్ మాట్లాడుతూ డాక్టర్ చింత రంగధామారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఇందులో భాగంగా తమ ట్రస్ట్ తరపున వరద బాధితులకు చీరలు దుప్పట్లు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు చినబాబు, ఆచంట సునీత, ట్రస్ట్ ప్రతినిధులు వేమూరి కాళీ కృష్ణ, గొంది ప్రదీప్, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి కొఠారి సత్యనారాయణ ప్రసాద్, మండల అధ్యక్షులు కట్ట వెంకట నరసింహారావు, పట్టణ కార్యదర్శి మైనేని రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.





సైమా బ్యూటీ ఎక్స్‌పో ప్రారంభం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: విజయవాడలోని స్థానిక ఎస్ఎస్ కన్వెన్షన్‌లో సైమా బ్యూటీ ఎక్స్‌పో ప్రారంభమైనట్లు ఎస్‌బిఎంఎస్ కో ఫౌండర్, డైరెక్టర్ బి.రాఘవీరెడ్డి, సైమా ఫౌండర్ మోక్ష్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే బ్యూటీ ఎక్స్పో లో అందుబాటు ధరలలో బ్యూటీ ప్రొడక్ట్సని అందరికీ అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యం అన్నారు. సైమా బ్యూటీ ఎక్స్పో అనేది ముంబాయి, తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ తో పాటు మరికొన్ని ముఖ్య నగరాలలో నిర్వహించామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్లో నిర్వహిస్తున్న ఈ బ్యూటీ ఎక్స్‌పో మొదటిదని రాబోయే రోజుల్లో విశాఖపట్నం తిరుపతిలో నిర్వహిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ ఎక్స్పోలో బ్రైడ్స్ మెహందీ, హెయిర్ కట్, సెల్ఫ్ మేకప్ కోర్స్, బేసిక్ అడ్వాన్స్డ్ ప్రొఫెషనల్ బ్రైడల్ మేకప్, ట్రెండింగ్ హెయిర్ స్టైల్స్, సారీ డ్రాపింగ్ అండ్ బాక్స్ ఫోల్డింగ్, ఫ్లవర్ మేకింగ్, బేసిక్, అడ్వాన్స్ బ్యూటీ పార్లర్ కోర్స్, కంప్లీట్ హైడ్రా ఫేషియల్ కోర్స్, బేసిక్ అడ్వాన్స్డ్ హెయిర్ కట్స్, నెయిల్ ఎక్స్టెన్షన్ క్లాసెస్ సంబంధించిన వివరాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ కె.శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్, విల్సన్ పాల్గొన్నారు.



వరద బాధితులకు ఆహారం అందజేస్తున్న మంత్రి సారథి

హెలికాప్టర్లు, మరబోట్లతో సహాయక చర్యలు : కొలుసు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: వరద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, అన్ని విధాలుగా ఆదుకుంటుందని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. మంగళవారం కృష్ణలంక ప్రాంతంలోని 15, 16 డివిజన్ల్లోని రామలింగేశ్వరనగర్, గీతా నగర్ కట్ట తదితర ప్రాంతాలలో పర్యటించి బాధితులతో మాట్లాడి అందుతున్న సహాయక చర్యలు గురించి తెలుసుకున్నారు. వరద బాధితులను ఆదుకుని అవసరమైన సహాయక చర్యలను చేపట్టడానికి ప్రభుత్వం పది హెలికాప్టర్లు, వందలాది మరబోట్లును ఉపయోగిస్తోందని మంత్రి తెలిపారు. బాధితులకు హెలికాప్టర్ల ద్వారా ఆహారం, మంచి నీరు అందిస్తున్నామన్నారు. 15వ డివిజన్లో రామలింగేశ్వరనగర్‌లో స్థానిక శాసనసభ్యుడు గద్దె రామోహన్‌రావుతో కలిసి బాధితులకు ఆహారం, మంచినీరు అందజేశారు. మంత్రి వెంట ఏలూరు శాసన సభ్యుడు బి.రాధాకృష్ణ, గోపాలపురం శాసన సభ్యులు వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనికి పది వేల మంది కార్మికులు : నారాయణ

ప్రజాశక్తి-విజయవాడ: ముంపు ప్రాంతాల్లో పారిశుధ్యం సాధారణ స్థితికి తీసుకురావడానికి పది వేల మంది కార్మికులు అవసరమని, నీరు తగ్గిన తర్వాత రోడ్లపై మురుగు లేకుండా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ తెలిపారు. ఈ మేరకు ఆయన వరద ప్రభావిత ప్రాంతాల్లో నీరు తగ్గిన తర్వాత చేపట్టాల్సిన పారిశుధ్య పనులపై మంగళవారం సమావేశం నిర్వహించారు. వరద ముంపు ప్రాంతాల్లో ఎంతో కష్టపడి బాధితులను బయటికి తీసుకొచ్చామని, దాదాపు బాధితులందరికీ ఆహారం అందేలా ఏర్పాట్లు చేశామని, మంగళవారం 8.5 లక్షల ఫుడ్ ప్యాకెట్లు పంపిణీ చేశామని చెప్పారు. ఐదు లక్షల వాటర్ బాటిల్స్ పంపిణీ చేశామన్నారు.